*1)శ్లో॥ 47 : కర్మణ్యే వాధి కార స్తే మాఫలేషు కదాచన ।*
*మా కర్మఫల హేతుర్భూ ర్మాతే సఙ్గోఽ స్త్వ కర్మణి ॥*
*(కర్మయోగము)*

**భావము :-** కర్మ సంపాదించుటయందే నీకు అధికారము కలదు. కర్మఫలములందు ఆశపడవలదు. కర్మయగు పాపపుణ్య ఫలములైన కష్టసుఖములకు కారకుడవు కావద్దు. అట్లే కర్మ వచ్చునని దానికి సంబంధించిన పనులు మానవద్దు.

**వివరము :-** ముందు శ్లోకములో ప్రతి మనిషికి గుణముల వలన యోచన లొస్తున్నవని, వాటివలన పనులు జరుగుచున్నవని తెలుసుకొన్నాము. గుణముల వలన జరుగు కార్యములలో కర్మ అనునదొకటున్నది. దానినే పాపపుణ్యములు అంటాము. అగ్నికి పొగ అనుబంధమైవున్నట్లు కార్యములకు కర్మ, కర్మకు కార్యములు అనుబంధమై ఉన్నవి. అనగ పనులకు పాపపుణ్యములు వచ్చుట, వచ్చిన పాప పుణ్యములను బట్టి తిరిగి పనులు జరుగుట ప్రతి జీవరాసికి ప్రకృతి సిద్ధమైనది. ప్రకృతి సిద్ధముగ మానవుడు గత జన్మల పాపపుణ్యములగు ప్రారబ్ధకర్మను అనుభవిస్తు, ఈ జన్మలో కార్యములు చేయుచున్నాడు. ఆ కార్యములలో అనుసంధానమైన కర్మను తాను చేశానని అనుకొని తిరిగి కర్మను మూటగట్టుకొంటున్నాడు. తరువాత జన్మలో దానిని అనుభవించవలసివస్తున్నది. ఇది ప్రకృతి సిద్ధమైన పద్ధతియైతే, దానికి వ్యతిరిక్తమైన పరమాత్మ పద్ధతి కూడ ఒకటున్నది. అది ఏమనగా! గతములో తనకు అంటుకొని ఉన్న కర్మ కార్యాచరణయైనపుడు, ఆ కార్యాచరణలో అనుసంధానమైవచ్చు క్రొత్త పాపపుణ్యములను (కర్మను), తనకు ఏమాత్రము సంబంధము లేకుండ చేసుకోవడము, అనగ క్రొత్త కర్మను తనయందు రాకుండ చేసుకోవడమనునది. క్రొత్తకర్మ లేనిది క్రొత్తగ వచ్చు కార్యములు ఉండవు. కావున జీవుడు క్రొత్తగ పుట్టి క్రొత్త పనులు అనుభవించవలసినది లేదు. కర్మాచరణలో ఉన్న కార్యముల ద్వార క్రొత్త కర్మ అంటకుండ చేసుకొని, క్రొత్త కార్యములు అమలు కాకుండ తప్పించుకోవడమే పరమాత్మ సిద్ధమైన పని. ప్రకృతి సిద్ధమైన పద్ధతి అనగ 'ప్రకృతినే చేరు పద్ధతి' అని, పరమాత్మ సిద్ధమైన పద్ధతనగ "పరమాత్మనే చేరు పద్ధతి" అని అర్థము చేసుకోవాలి.

భగవంతుడు ఇటువంటి రెండు పద్ధతులున్నాయని తెలుపుచు కర్మను ప్రకృతిసిద్ధముగ సంపాదించుకో వచ్చును, లేక పరమాత్మ సిద్ధముగ దానిని లేకుండ కూడ చేసుకోవచ్చును. ఈ రెండు పద్ధతులలో ఏదైన ఒక దానిని ఆచరించి కర్మను సంపాదించుకోవడములోనో, లేక సంపాదించుకోకుండ చేసుకోవడములోనో, మానవునికి అధికారమున్నదని తెల్పాడు. "కర్మణ్యే వాధి కారస్తే" అనగా కర్మను సంపాదించుట, సంపాదించకపోవుటలో నీకు అధికారము కలదని తెలియుచున్నది. అట్లే కర్మ ఫలములైన సుఖదుఃఖములను అనుభవించడములో ఎవరికి అధికారము లేదు. కర్మ ఒక మారు సంపాదించబడియుంటే అది కార్యరూపమై కష్టసుఖములుగ అనుభవమునకు వచ్చును. సంపాదించబడియున్న కర్మవలన కలుగు కష్ట సుఖములను ఎవరు నివారించలేరు. విష్ణు, ఈశ్వర, బ్రహ్మసహితము అనుభవించ వలసివుండును. కావున కర్మఫలమైన కార్యములందు ఎవరికి ఏ అధికారము లేదు. అవి ఎట్లు ఉంటే అట్లే చేయవలసియుండును, మరియు అట్లే అనుభవించవలసి ఉండును.

అసలు కర్మ విషయమిలాగున్నది, కావున కర్మఫలముల మీద ఆశపడి వాటికి కారణ భూతుడననుకొని క్రొత్తకర్మలు తెచ్చుకోకూడదు. అలాగే పనులుచేస్తే కర్మలు వచ్చునని ఆ కర్మలు రాకుండుటకు పనులు మానుకోవలయుననుకోకూడదు. ఎందుకనగ మొదటి కర్మాచరణే తర్వాత చేయబడు కార్యములు, కావున కార్యములు నీవు చేయకూడదను కొనుట పొరపాటు. ఎవరేమనుకొన్నను కర్మప్రకారము జరుగవలసినవి జరుగక మానవు. కాని నీకు కర్మ సంపాదించడమందు మాత్రమే అధికారమున్నదని, పనులు చేయడములో కాని, అనుభవించడములో కాని అధికారము లేదని తెలియాలి. ఇతరులు వ్రాసిన గీతలలో ఈ శ్లోక భావము పూర్తి తప్పుగ ఉన్నది. (పనులు చేయుటలో అధికారము గలదు, ఫలితము మీదనే లేదని వ్రాశారు. పనులు చేయుటలో అధికారము లేదు, ఫలితము మీదనే ఉన్నదని మేము వ్రాశాము.) పని మీద అధికారము లేదని, నీ ఇష్టమున్నా లేకున్నా బలవంతముగ నీచేత పని చేయించబడునని, నీవు నీ కర్మరీత్య యుద్ధము చేయవలసి ఉన్నదని, నీకిష్టము లేకున్నా నీచేత కర్మ చేయించి తీరునని భగవంతుడు చెప్పడము జరిగినది. దీనిని బట్టి పనిమీద అధికారము లేదనునది స్పష్టముగ తెలియుచున్నది. అందువలన మేము వ్రాసిన భావమే ఈ శ్లోకమునకు సరియైనదని జ్ఞప్తి చేయుచున్నాము.